క్లుప్తంగా

నేడు హనుమజ్జయంతి



నక్కపల్లి: హనుమజ్జయంతిని పురస్కరించుకుని నక్కపల్లిలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మన్యుసూక్త సహిత అభిషేకం, సహస్రనామ సింధూర నాగవల్లిదళ పుష్పార్చన, అనంతరం హోమం, నీరాజన మంత్ర పుష్పాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామివారి తిరువీధి సేవ, రాత్రికి భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. బుధవారం విద్యార్థులతో వందేమాతరం గీతం పాడించారు. తాళ్ళరావు విద్యార్థులకు మ్యాథ్స్ బోధించారు. నీతి కథలు చెప్పారు. దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు. సూర్య నమస్కారాలు, ప్రాణాయామంపై విద్యార్థులకు యోగా గురువు రాజు అవగాహన కల్పించారు.

చెస్‌తో మేధాశక్తి పెంపు



విద్యార్థులకు చెస్ శిక్షణ ఇస్తున్న ప్రముఖ విద్యావేత్త కొల్లి సత్యారావు

అచ్యుతాపురం రూరల్ : చెస్ ఆడడం వల్ల మనిషి మేధాశక్తి పెరుగుతుందని ప్రముఖ విద్యావేత్త కొల్లి సత్యారావు అన్నారు. విజ్ఞాన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడటం ద్వారా బుద్ధికి వ్యాయామం చేసినట్లు అవుతుందన్నారు. క్రీడలో వ్యూహాత్మకత, ఎత్తుకు పైఎత్తు వంటి ఆలోచనలు ద్వారా మెదడుకు మంచి కసరత్తు జరుగుతుందన్నారు. తద్వారా మనస్సు, బుద్ధి చురుగ్గా పని చేస్తాయన్నారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదానది తీరాన గల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలకు వేదిక కానుంది. గురువారం నుంచి నాలుగు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. స్థానిక అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో పది నాటికలను ఎంపిక చేసి, ప్రదర్శనకు సన్నాహాలు చేశారు. ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు యువ భేరి థియేటర్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) వారి 'నా శత్రువు' నాటిక, బీవీకే క్రియేషన్స్ (కాకినాడ) వారి 'తితిక్ష' నాటికలను ప్రదర్శించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు తెలిపారు. తమ పరిషత్ ఏర్పాటు అయిన తర్వాత ఐదో విడతగా నిర్వహిస్తున్న పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేసి, ప్రోత్సాహం అందించాలని కోరారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు



వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయంగా విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం మునగపాకకు చెందిన ఆడారి శివసూరప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సోమేశ్వరరావు, భాస్కరావు రూ.5,116, టెక్కలి అప్పారావు రూ.5116 చొప్పున విరాళాలు అందజేశారు. కమిటీ సభ్యులు పెంటకోట ఉమేష్, బొడ్డేడ రామునాయుడు, ఆడారి అచ్చియ్యానాయుడు, విల్లూరి నూకనరసింగరావు, ఆడారి గణేష్, విల్లూరి మోహన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



భారీ ఎత్తున దెబ్బతిన్న మూలపాలెం గ్రోయిన్



శిథిలావస్థకు చేరుకున్న కొరుప్రోలు పెద చెరువు కలింగళ్ చప్టా

గ్రోయిన్లకు మోక్షమెప్పుడో?

గ్రోయిన్ల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రోయిన్ల మరమ్మతులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎస్.రాయవరం మండలంలో చాలా చోట్ల గ్రోయిన్లు శిథిలావస్థకు చేరి సాగునీరు వృథా అవుతోంది. దీని వల్ల పంటలకు నీరు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్టే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- సాగునీటి వనరులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- చాలా చోట్ల శిథిలావస్థకు చేరిన గ్రోయిన్లు
- మరమ్మతులకు విడుదల కాని నిధులు
- సాగునీరు అందక నష్టపోతున్నామని రైతుల గగ్గోలు

నిధులు విడుదల కాలేదు



మరమ్మతులకు నోచుకోని జమ్మికాలువ

జమ్మీకాలువకు, కొరుప్రోలు చానల్ మరమ్మతులకు నిధులు విడుదల కాలేదు. మండలంలో ఈ గ్రోయిన్లపై ఆధారపడి వరి సుమారు 10 వేల ఎకరాలు, కొబ్బరి 7 వేల ఎకరాలు, అరటి, తమలపాకు, జీడిమామిడి, ఇతర ఆరుతడి పంటలు సుమారు 5 వేల ఎకరాలు సాగులో ఉన్నాయి. ఈ గ్రోయిన్లకు ఆనుకుని ఉన్న గేటు తలుపులు కూడా పాడైపోయాయి. వాటిని కూడా సరిచేసిన నాథుడు కరువయ్యారని రైతులు వాపోతున్నారు. కొరుప్రోలు పెద చెరువు కలింగల్ చప్టా శిథిలమైపోయింది. ఇక్కడున్న చిన్న ఫుట్‌పాత్ మదుం పాడైపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వేసవి రోజుల్లో గ్రోయిన్ల మరమ్మతులు చేపడితే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందే అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు.

ఎస్.రాయవరం: మండలంలో 90 శాతం పంటల సాగు వర్షాధారమే. వర్షాలు పడే సమయంలో వరాహ నదిపై నిర్మించిన గ్రోయిన్ల ఆధారంగా గ్రామాల్లో ఉన్న చెరువులు నిండుతాయి. ప్రస్తుతం గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. సుమారు 20 ఏళ్లుగా మూలపాలెం, 15 ఏళ్లుగా పెదఉప్పలం, రెండేళ్లుగా జమ్మీకాలువ గ్రోయిన్లు దెబ్బతిన్నాయి. దీంతో సాగునీరు వృథాగా దిగువకు పోయి సముద్రంలో కలిసిపోతోంది. మరోవైపు ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు.

– మూలపాలెం గ్రోయినను గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1.10 కోట్లు వెచ్చించి డైరక్షన్ మార్చి నిర్మించారు. ఆ నిర్మాణంతో గ్రోయిన్ నుంచి నీరు ప్రవహించకపోగా నది గట్టు పెద్ద ఎత్తున కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రమాద నివారణ చర్యలుగా రూ.35 లక్షలు వెచ్చించి గట్టు పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఆ గ్రోయిన్ డైరక్షన్ వల్ల చిన్నచిన్న నిర్మాణాలు గ్రోయిన్‌కు సరిపోవని, మినీ ఆనకట్టు మాదిరిగా నిర్మాణం చేయాలని ఇరిగేషన్ అధికారులు నివేదికలు ఇచ్చారు. అప్పటి నుంచి ఈ గ్రోయిన్‌కు నిధులు కేటాయింపులు జరగలేదు. ఇప్పుడు నియోజకవర్గంలో హోంమంత్రి ఉన్నారని, నిధులు విడుదల అవుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

శ్రమదానంతో సాగునీరు తరలింపు



దెబ్బతిన్న పెదఉప్పలం గ్రోయిన్

పెనుగొల్లు గ్రోయిన్ నిర్మాణం చేయక ప్రతి ఏడాది అన్నదాతలు శ్రమదానంతో పనులు చేసుకుని వీలైనంత సాగునీటి తరలించుకుంటున్నారు. ఆ సమయంలో నీటి ఉధృతి పెరిగితే.. చేసిన పని అంతా నీటి పాలు అవుతోంది. ఇలా సీజన్‌లో రెండు దఫాలు అవస్థలు పడి, లక్షల రూపాయలు వృథా చేసుకుంటున్నారు. ఇక్కడ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులు పూర్తి కాలేదు.

తక్షణం మరమ్మతులు చేపట్టాలి



వరాహ నదిలో ఉన్న గ్రోయిన్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి. లేకపోతే ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందడం కష్టమే. ఈ ఏడాది అయినా పనులు పూర్తి చేయాలి. రైతులు ఆదుకుంటామన్న ప్రభుత్వం సాగునీటి కష్టాలపై కూడా దృష్టి సారించాలి.

– కోశెట్టి వెంకటరమణ, సర్పంచ్, పెదఉప్పలం

నిధులు విడుదలైతే పనులు చేపడతాం..

మండలంలో వరాహ నదిపై ఉన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అవసరమైన నిధుల కోసం నివేదికలు తరచూ పంపుతున్నాం. నిధులు విడుదల కాలేదు. మరమ్మతులు చేపట్ట కాలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు అధికారులు అవస్థలు పడుతున్నారు. నది పొంగినప్పుడే చెరువులకు నీటిని మళ్లించే ఏర్పాట్లు చేస్తున్నాం. అలా చేసినా పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు.

– భాను, ఇరిగేషన్ ఏఈ, ఎస్.రాయవరం మండలం

ఆత్మీయ అధినేతకు వివాహ ఆహ్వానం



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వీసం

నక్కపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ మాజీ డైరెక్టర్, పార్టీ సీనియర్ నేత వీసం రామకృష్ణ కలిశారు. వచ్చే నెల 7న జరిగే తన రెండో కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. తన పెద్ద కుమారుడి వివాహానికి అనివార్య కారణాల వల్ల రాలేకపోయానని, ఈ దఫా తప్పకుండా వస్తానని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపినట్లు వీసం చెప్పారు. అధినేతను కలిసిన వారిలో వీసం సోదరులు వైస్ ఎంపీపీ వీసం నానాజీ, నక్కపల్లి ఉప సర్పంచ్ వీసం రాజు, పార్టీ సీనియర్ నాయకుడు వీసం శ్రీను ఉన్నారు.

'ఉపాధి పనులు పెండింగ్ పెట్టొద్దు'



ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో గుర్తించిన ఉపాధి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. లేబర్ డైలీ వేజ్, వేజ్ కాంపోనెంట్, ఫారం పాండ్స్, సోక్‌పిట్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్స్, ఇంకుడు గుంతల గురించి సమీక్ష చేశారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికి పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. గుర్తించిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో భాగ్యలత, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



మునగపాక సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీపీవో శిరీషారాణి అన్నారు. మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా తయారయ్యే కంపోస్టు అమ్మకాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పాటుపడాలన్నారు. ఇంత వరకు ఎంతమేర ఆదాయం సమకూరిందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంకటేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు అప్పారావు మృతికి సంతాపం



అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

ఎస్.రాయవరం: విశ్రాంత ఉపాధ్యాయుడు చక్క అప్పారావు మృతి ఉపాధ్యాయ సంఘానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పాకలపాటి రఘువర్మ అన్నారు. పెదఉప్పలం గ్రామంలో ఇటీవల మృతిచెందిన అప్పారావుకు అడ్డురోడ్డులో సంతాప సభ నిర్వహించారు. అప్పారావు చిత్ర పటానికి రఘువర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్. ధర్మారావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎస్. దుర్గాప్రసాద్, సింహాచలం, అప్పలరాజు, వీరభద్రరావు, ప్రసన్నకుమార్, హుషేన్, వరప్రసాద్, సత్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోసయ్యపేటలో పారిశుధ్య పనులు



కాలువల్లో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

అచ్యుతాపురం రూరల్ : తాజాగా కురుస్తున్న వర్షాలకు మోసయ్యపేటలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సర్పంచ్ పంచదార్ల పైడిరాజు వెంటనే స్పందించి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. అకాల వర్షాలకు కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను దగ్గరుండి శుభ్రం చేయించారు. గ్రామంలో మోకాళ్ల లోతు వరకు వర్షపునీరు చేరడంతో పైడిరాజు యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాజాంలో ఆర్మీ జవాన్‌కు సత్కారం



రాజాంలో ఆర్మీ జవాన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం గ్రామంలో ఆర్మీ జవాన్ నడిపల్లి అశోక్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఆకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్మీ జవాన్‌ను సత్కరించారు. ఇటీవల పాకిస్తాన్ యుద్ధం చేసిన బోర్డర్ దగ్గరలోనే అశోక్ విధులు నిర్వహిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా జమ్ముకాశ్మీర్, శ్రీనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అశోక్ మంగళవారం రాత్రి స్వ గ్రామం రాజాం చేరుకున్నాడు. దేశ సేవలో పాల్గొంటున్న అశోక్‌ను జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామ యువకులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పహల్గాంపై పాకిస్తాన్ దాడి చేసి టూరిస్టులను పొట్టన పెట్టుకోవడం పిరికిపంద చర్య అని, భారతదేశాన్ని కాపాడుకోవడానికి శక్తివంచన లేకుండా పోరాటాలు చేస్తామని జవాన్ అశోక్ తెలిపారు. జై జవాన్ , జై కిసాన్ అంటూ యువకులు గ్రామంలో నినాదాలు చేశారు.

పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు



సత్యనారాయణపురం కాలనీలో పంచ ముఖ ఆంజనేయ స్వామి

దేవరాపల్లి : పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం తెల్లవారజాము నుంచి స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పంచముఖ ఆంజనేయ స్వామి యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

జోరు వానతో ఉపశమనం



కోటవురట్లలో మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు



జలమయమైన మునగపాక బీసీ కాలనీ



వాడ్రాపల్లిలో మృతిచెందిన పాడి ఆవు

కోటవురట్ల: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోయి ఉక్కిరబిక్కిరైన ప్రజలు ప్రస్తుత వాతావరణంతో ఆహ్లాదాన్ని అనుభవిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి మండలంలో వర్షం పడుతుండగా బుధవారం కూడా రోజంతా చిరుజల్లులు కొనసాగాయి. దాంతో వడగాడ్పులు పోయి చల్లటి వాతావరణం చోటుచేసుకుంది. రహదారులు, పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం ఎదుట భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మునగపాకలో భారీ వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మునగపాక బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, మండల సముదాయానికి వెళ్లే రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు జనం ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వ్యవసాయ రంగానికి మేలు చేస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

మండలంలోని వాడ్రాపల్లిలో పిడుగుపాటుకు పాడి అవు మృతి చెందింది. బుధవారం పిడుగుల కారణంగా గ్రామానికి చెందిన భీశెట్టి జోగినాయుడు పాడి అవు మృత్యువాతకు గురైంది. సుమారు రూ.52 వేలకు పైగా నష్టం జరిగిందని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎస్.రాయవరం: సైతారుపేట గ్రామంలో మేడ పైనుంచి జారిపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న రాత్రి సమయంలో వీసం లక్ష్మి(35) మేడపై నిద్రిస్తూ మధ్యలో లేచి కిందకు దిగుతున్న సమయంలో మెట్ల పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను హుటాహుటిన కుటుంబ సభ్యులు ముందుగా యలమంచిలి, ఆ తరువాత విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సత్వరమే ఇళ్లు నిర్మించుకోవాలి



వెదురుపర్తిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: లబ్ధిదారులు తమకు మంజూరైన గృహాలను సత్వరమే నిర్మించుకోవాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ గృహ నిర్మాణ కాలనీని మండల హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. అసంపూర్తి గృహాలు సకాలంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకుంటే బిల్లులు సత్వరమే చెల్లించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా బుధవారం ఉత్సవ కమిటీని డ్రా పద్ధతిలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ మాడుగులలో 16 వార్డుల నుంచి వార్డుకు ఒక్కరు చొప్పున సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై జెడ్పీ సీఈవో విచారణ

మాకవరపాలెం : పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై జడ్పీ సీఈవో విచారణ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండు ఎదురుగా ఉన్న మండల పరిషత్ షాపులకు వేలం నిర్వహించాలని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ ఆదేశాలతో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదుదారైన ఫ్రాన్సిస్ సమక్షంలో విచారణ చేపట్టారు. ప్రస్తుతం షాపులకు సంబంధించి అద్దెల వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకు షాపులకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎంపీడీవో ఛాయాసుధ, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

విస్తారంగా మిరప పంట సాగు



దాలివలసలో సాగులో ఉన్న మిరపచేను

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరపపంట సాగు కాలంలో 10 రోజులకు ఒక్కోసారి నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేపడితే మొక్కనాటిన 45 రోజులకు మిరపపంట పూతదశకు చేరుకుని దిగుబడి ప్రారంభం అవుతుందని సాగు రైతులు తెలుపుతున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో మంచి లాభాలు పొందగలమని రైతులు చెబుతున్నారు. మండలంలో దాలివలస, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 90 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నారు.